**"ఒసే కాంతం, సామాన్లన్నీ సరిగా సర్దేవో లేదో చూడు. అందులో రైలు ప్రయాణం. అక్కడికి వెళ్ళిన తర్వాత అవి మరచిపోయాను, ఇవి మరచిపోయాను అంటే కుదరదు," ప్రయాణపు ఆదుర్దాలో భార్యను హెచ్చరించాడు పరంధామయ్య.**

"మీరు మరీను మీరు కంగారుపడి నన్ను కంగారుపెట్టకండి." అని భర్తను వారిస్తూ. కొడుకువైపు చూసి "ఒరే రామూ! సామాన్లన్నీ ఆటోలో సరిగా పెట్టావో. లేదో చూడు."

"అన్నీ సరిగానే ఉన్నాయమ్మా. మీదే ఆలస్యం" అన్నాడు రామం.

"ఇల్లు జాగ్రత్త నాయనా. ఎక్కడికీ వెళ్ళమాకండి." అని కోడలివంక చూసి "అమ్మా అనూరాధా! నువ్వు కూడా జాగ్రత్తగా ఉండమ్మా. మేము లేము కదా అని తాళం పెట్టి ఎక్కడికీ ఊరాయించకండి. ఎల్లుండి పొద్దుటికల్లా వచ్చేస్తాం. మీ మావయ్యగారి ప్రాణమిత్రుడు షష్టిపూర్తి చేసుకుంటూవుంటే. ఆయనవుండబట్టలేక చూసొద్దామని అంటుంటే బయలేరాం. లేకపోతే ఇప్పుడప్పుడే ప్రయాణం పెట్టుకొనే వాళ్ళము కాదు" అని రెండు మూడుసార్లు కొడుకుని కోడల్ని హెచ్చరించి. ఆటో ఎక్కారు పరంధామయ్య దంపతులు.

* * *

"ఇవాళ ఎక్కడికైనా వెళదామండీ ఇంట్లో కూర్చుని తెగబోరు కొడుతోంది. మీకు ఇవ్వాళ సెలవుకూడా కదా" అని అడిగింది అనూరాధ


"మైడియర్ రాధా! అంతా తెలిసి కూడా ఎందుకడుగుతున్నావో నాకర్థం కావటం లేదు. ఈ ఇంట్లో వుండే ఇద్దరిలో ఎవరో ఒకళ్ళమే బయటికి వెళ్ళగలం ఇంటికి తాళం వేయకూడదనే నాన్నగారి ఛాందస భావము మీరగలమా?"

"మీరెప్పుడూ యింతే ఎప్పుడు అవునన్నారు కనుక! మామగారిది ఎప్పుడూ వుండే ఛాందస భావమే కదా ఏదైనా సినిమాకి వెళితే బాగుండును."

"నాన్న ఉన్నపుడు ఎట్లానూ సినిమా చూడడం పడదు నాన్నా. అమ్మా లేరుకదా సినిమాకి వెళదామంటే ఎప్పుడు దిగుతారో తెలియదు. ఇంటికి తాళం వేశామంటే వచ్చినతరువాత నానాహంగామా చేస్తారు" అంటూ తన నిస్సహాయతను వెల్లడించాడు రామారావు.

ఇద్దరూ డీలాపడిపోయి ఒకళ్ళనుచూసి ఒకళ్ళు నిట్టూరుస్తున్నారు. అంతలో తలుపు చప్పుడయింది. ఎదురుగా కమల, వాళ్ళ ఆయన అనుకోకుండా దిగారు.

"ఏమే అనూ! ఏంటి అలా కళ్ళు



# కొత్తదంపతుల పాట్లు

అప్పగించి చూస్తున్నావు. నన్ను లోపలికి రానిస్తావా లేదా" అంటున్న కమల మాటలకు తేరుకున్న అనూరాధ "రండి! చాలా కాలం తర్వాత అనుకోని మీ రాకవల్ల కొద్దిగా ఆశ్చర్యపోయాను. అంతే" అంటూ హాలులోకి దారి తీసింది.

కమలా వాళ్ళాయన. రామారావు కబుర్లలో పడ్డారు. కమలా. రాధ వంటింట్లోకి వెళ్ళి కబుర్లు పెట్టుకున్నారు. కాసేపు అయిన తరువాత ఏదో పని ఉన్నట్టు అనూరాధ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది భర్తను సైగచేసి పిలిచి "మనం సినిమాకి వెళదాము అనుకుంటున్న సమయంలో వీళ్ళొకళ్ళు వూడిపడ్డారు. నాకొక మంచి ఐడియా తట్టింది. వీళ్ళిద్దరినీ ఇక్కడ ఉంచేసి మనం చెప్పకుండా సినిమాకి చెక్కేద్దాము. మీరు పెరటి గుమ్మంలోకి స్కూటరు తీసుకురండి", అంది భర్తతో మెల్లిగా.

"అమ్మో! ఇంకేమైనా ఉందా అయినా స్కూటర్ తీస్తే వాళ్ళకు ఎలాగైనా తెలిసిపోతుంది. పైగా ఇంటికి చుట్టపు చూపుగా వచ్చినవాళ్ళను ఇంట్లో వదలేసి మనం సినిమాకి వెళ్తే ఏం బాగుంటుంది?"

"మీకెప్పుడూ పిరికితనమే, స్కూటరు లేకపోతే లేకపోయింది గాని నేను చెప్పినట్లు చేయండి. నేను వంటగదిలో వుండి శబ్దం చేస్తాను. మీరువెళ్ళి టాయిలెట్ అయి. బెడ్‌రూమ్‌లోనుంచి శబ్దం చేయండి. నేను టాయిలెట్ అవుతాను. మీరు. నేను చిన్న పనివుందని. ఇప్పుడే వస్తామని చెప్పి సినిమాకి చెక్కేయటమే.

"సరే అలాగే సిద్ధంగా వుండు" అంటూ బెడ్‌రూమ్ నుంచి నిష్క్రమించాడు రామారావు.

* * *

ఇద్దరూ ఎట్లాయితేనేమి కమలను. వాళ్ళాయనను ఇంట్లోఉంచి బయటపడ్డారు. సినిమాచూసి రాత్రి ఇంటికి చేరుకునేటప్పటికి తొమ్మిదిన్నర అవుతోంది. కమలా వాళ్ళాయన వరండాలో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. కమల వంటింట్లో ఏదో సర్దుతోంది.

ఇంట్లోకి వస్తున్న అనూరాధను చూసిన కమల "ఏమే-నీవు, మీ ఆయన భలేపని చేశారే! మాకేదో తోచకపోక ఇన్నాళ్ళకు మీ ఇంటికి వస్తే మంచి మర్యాదే చేశారు. ముందుగానే చెపితే మేము వెళ్ళిపోయేవాళ్ళంగా ఈ మూడు గంటలూ నాకైతే మహ బోరు పుట్టిందనుకో. మా వారు మాత్రం నాకేమీ తోచటం లేదంటూ ఇప్పటిదాకా బయట తిరిగొచ్చి అరగంట

క్రితమే పడుకున్నారు. నేను మీరు వచ్చే లోపల కనీసం పలహారాలన్నా చేద్దామని అప్పడాల కర్రకోసం వెతుకుతున్నా"

"ఈ ఒక్కసారికి మమ్మల్ని క్షమించవే కమలా. పెళ్ళయి సంవత్సరమైనా ఇంతవరకు మేమిద్దరం కలిసి సినిమాకు వెళ్ళటానికి ఇక్కడకు వచ్చిన తరువాత అసలు వీలుపడలేదు. అత్తయ్య, మామయ్య ఊరు వెళ్ళారుగదా సినిమాకి వెళ్ళొచ్చుననుకుంటే ఇంటికి తాళము వేయటం మా మామగారికి సుతరామూ ఇష్టంలేదు. వాళ్ళ పూర్వీకులు ఎవ్వరూ ఈ ఇంటికి ఇంతవరకు తాళము వెయ్యలేదట! ఆ సంప్రదాయము తనవరకు అలానే వుండాలంటారాయన. మిమ్మల్ని ఇబ్బందిలో పెట్టినందుకు సిగ్గుగావుందే!

"సరేలే! అయ్యిందేదో అయింది. అదిగో మా వారు కూడా లేచినట్లున్నారు. మేము ఇక వెళ్ళొస్తామే. ఈసారి మటుకు మీరు ముందే చెపితే మా అవస్థలేవో మేము పడతాం" అంటూ ప్రయాణమైంది కమల

"భోజనంచేసి వెళ్ళరదంటూ అనూరాధ దంపతులు బ్రతిమాలినా వినకుండా కమల వాళ్ళాయనా ఆటో ఎక్కి వెళ్ళిపోయారు ఇంటికి.

వాళ్ళ అటు వెళ్ళారో లేదో ఆటోలో దిగారు పరంధామయ్య దంపతులు. దిగగానే పరంధామయ్యగారి భార్య "ఒరే రామూ! ఏంటిరా! వీధి తలుపులన్నీ బార్లా తెరిచి వున్నాయి ఏమీ జరగలేదు కదా" అంది

"అబ్బే! అదేమీ లేదమ్మా నేనిప్పుడే వస్తున్నా!"

"ఇప్పుడే రావడమేంటిరా ఇల్లు కదలొద్దని మరీమరీ చెప్పానుగా"

"రాధకు కొద్దిగా నలతగా ఉంది పడుకుంది. సరే ఈ రోజు వంటేమి చేస్తుందిలే అనుకొని, హోటల్లో తిని ఇప్పుడే వస్తున్నా" అనుకోకుండా అబద్ధమాడేశాడు రామారావు

"ఏం మాయదారి రోగాలో ఏమో. నేను లేకపోతే ఇల్లంతా ఒక కొలిక్కి తెస్తారు గదా" అంటూ లోపలికి వెళ్ళిపోయింది కాంతమ్మగారు.

రాత్రి పడకగదిలో అనూరాధ భర్తను మెల్లిగా కుదుపుతూ "అబద్ధం బాగానే ఆడారు అబ్బాయిగారు ఎట్లయితేనేమి ఒక గండం తప్పించారు."

"ఎన్ని అబద్ధాలు ఆడినా అంతా దేవిగారి కరుణాకటాక్షానికే కదా" అన్నాడు లైటార్పుతూ రామారావు.


—జి. వెంకటకృష్ణ

# బాంచ్ పానీ

## గోడలమీది రాతలు

"అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతి నాపలేరు"...."ఆకలితో చచ్చేకన్నా పోరాటంలో చావటం మేలు" "తుపాకి గొట్టంలోంచే అధికారం వస్తుంది"—ఆంధ్రదేశంలో ఏ వూరి గోడలమీద చూసినా యిలాంటి నినాదాలు తాటికాయలంత అక్షరాలతో ఎర్రగా, కొట్టవచ్చినట్టు కనిపిస్తాయి.

కొత్తకొత్త నినాదాల్ని రూపొందించటంలో మనవాళ్ళు చాలా ప్రావీణ్యాన్ని సంపాదించారనిపిస్తోంది. ఈ మధ్యనే "ఆత్మను అమ్ముకున్నవాడు అమ్మను కూడా అమ్ముకుంటాడ"న్న సరికొత్తనినాదాన్ని చూశాను.



ప్రపంచంలో ఏమూల ఏం జరిగినా అది మన గోడలమీది కెక్కిపోతుంది. "కంపూచియాపై వియత్నాం దాడిని తిప్పికొట్టండి" "ఆఫ్ఘనిస్తాన్‌పై రష్యా దాడిని ప్రతిఘటించండి" అన్న నినాదాల్ని చూసినప్పుడు కంపూచియా అనే దేశం ఎక్కడుందో, ఆ దేశంపై వియత్నాం ఎందుకు దాడి చేసిందో, ఆంధ్రదేశంలో వున్న మనం ఆ దాడిని ఎలా తిప్పికొట్టగలమో మనలో చాలామందికి అర్థంకాదు.

పరస్పర విరుద్ధమైన నినాదాలు ఒకదాని పక్కనే ఒకటి పెద్ద పెద్ద అక్షరాలతో శాంతియుత సహజీవనాన్ని చేస్తుండటం చూస్తే గమ్మత్తుగా వుంటుంది. 'సాయుధ విప్లవమే ఈ దేశానికి శరణ్యం' అన్న నినాదానికి పక్కనే 'దేశం రాజీవ్‌గాంధి నాయకత్వాన్ని కోరుతోంది' అన్నవినాదం ఉంటుంది.

ఈ గోడలమీద రాతల్ని చదివే సామాన్య మానవుడికి వాటిల్లో యేది నిజమో, యేది నిజంకాదో, దేన్ని నమ్మాలో, దేన్ని నమ్మకూడదో అర్థంకాని అయోమయ పరిస్థితి యేర్పడుతుంది.

పూర్వం ఎక్కడో పనికిరాని గోడల మీద ఫలానా అభ్యర్థికి ఓటెయ్యండనో, ఫలానా మందును వాడండనో రాస్తుండేవాళ్ళు. కాని ప్రతి గోడమీద ఒక అంగుళంమేర కూడా వదలకుండా ఈ రకమైన విప్లవ నినాదాల్ని రాసే సంస్కృతిని తెలుగుదేశంలో ఎవరు ప్రవేశపెట్టారోగాని అదిప్పుడు మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందుతోంది. ఏ ఇల్లుగలవాడైనా తనకూతురి పెళ్ళికి తన ఇంటికి సున్నాలు వేయించుకుంటున్నాడంటే వాడిమీద జాలేస్తుంది. తెల్లగా తయారైన ఆ ఇంటి గోడల్ని ఖరాబు చెయ్యటానికి ఎంతమందో తమ తమ బ్రష్‌లను, కలర్స్‌ను సిద్ధం చేసుకుంటారు. తెలుగు సాహిత్యంలోని విప్లవ కవిత్వమంతా తెల్లారేటప్పటికి ఆ గోడలమీదకెక్కుతుంది. అసలు విప్లవం ఎప్పుడొస్తుందో తెలీదుగాని మన తెలుగువాళ్ళు మాత్రం అత్యంత వేగంగా గోడలమీదకు విప్లవ నినాదాల్ని ఎక్కించటంలో నిజమైన విప్లవాన్నిసాధించారు.

విప్లవాన్ని లక్ష్యంగా పెట్టుకున్న వివిధ గ్రూపులవాళ్ళు ఒకరితో ఒకరు పోటీపడి గోడల్ని ఖరాబు చెయ్యడం ద్వారా యేం సాధిస్తున్నారు? ఈ నినాదాల్ని చదివిఎంతమందివిప్లవోన్ముఖులుగామారుతున్నారు? ఈ విప్లవ నినాదాల్ని ఫలానా ఎలుకల మందు వాడండనో, ఫలానాబీడీలనే తాగండనో రాయబడే రాతలతో కలిపెయ్యడం ద్వారా విప్లవంలో ఉన్న సీరియస్‌నెస్‌ను దిగజార్చివెయ్యటం లేదూ! నానా తంటాలుపడి తమ ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలనుకునే మధ్యతరగతి గృహస్తుల మాటేమిటి? అలాగే పట్టణాల్ని శుభ్రంగా వుంచుకోవాలనే సివిక్ సెన్స్ మన విప్లవకారులకుండాల్సిన అవసరం లేదా?

—నవీన్